## ఇళయదళపతి విజయ్ బర్త్ డే స్పెషల్

# జననాయగన్ ది ఫస్ట్ రోర్

కోలీవుడ్ నటుడు విజయ్ హీరోగా దర్శకుడు హెచ్. వినోద్ రూపొందిస్తున్న చిత్రం 'జన నాయగన్'. పూజా హెగ్డే కథానాయిక. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా సిద్ధమవుతోంది. విజయ్ నటిస్తోన్న చివరి చిత్రం ఇదేనంటూ గత కొంతకాలంగా కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతుండటంతో ఈ సినిమాపై అభిమానుల్లో ఎంతో ఆసక్తి నెలకొన్న విషయం తెలిసిందే.

ఆదివారం విజయ్ పుట్టినరోజును పురస్కరించుకొని చిత్రబృందం తాజాగా ఒక ప్రత్యేక వీడియోను పంచుకుంది. 'ది ఫస్ట్ రోర్' అని పేర్కొంటూ దీనిని విడుదల చేసింది. ఇందులో విజయ్ పోలీస్ లుక్‌లో పవర్‌ఫుల్‌గా కనిపించారు. అనిరుధ్ ఈ చిత్రానికి స్వరాలు అందిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 9న ఈసినిమా విడుదల కానుంది.







'పరమ్ సుందరి'గా త్వరలో ప్రేక్షకుల్ని పలకరించడానికి ముస్తాబవుతోంది బాలీవుడ్ యువ కథానాయిక జాన్వీ కపూర్. ఆమె, సిద్ధార్థ్ మల్హోత్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. రొమాంటిక్ కామెడీ నేపథ్యంలో 'దస్వీ' ఫేమ్ దర్శకుడు తుషార్ జలోటా తెరకెక్కిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుగుతున్న ఈ సినిమాను వచ్చే నెల 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. తాజాగా ఇప్పుడీ 'పరమ్ సుందరి' రాకకు ఆలస్యం కానున్నట్లు తెలుస్తోంది. జులైలో సినిమాల విడుదలలు ఎక్కువగా ఉండడం వల్ల దీన్ని ఆగస్టులో థియేటర్లలోకి తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. దినేశ్ విజన్ నిర్మాత. ప్రస్తుతం జాన్వీ జాబితాలో 'పెద్ది', 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' లాంటి చిత్రాలున్నాయి.

## పరమ్ సుందరి పలకరించేది ఆగస్టులో?

# 'కుబేర'.. తొలిరోజు ఎన్ని కోట్లు రాబట్టిందంటే..?




ధనుష్ , నాగార్జున ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకుడు. శుక్రవారం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అంతటా పాజిటివ్ రివ్యూలు సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ఫస్ట్ డే కలెక్షన్లను చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా తొలిరోజు రూ.30 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు అంచనా వేస్తున్నామని పేర్కొంది. మరోవైపు నార్త్ అమెరికాలో తమ చిత్రానికి విశేష ఆదరణ లభిస్తున్నట్లు తెలిపింది. ఇప్పటివరకూ అక్కడ 1.3 మిలియన్ డాలర్ల గ్రాస్ రాబట్టినట్లు వెల్లడించింది. తమ సినిమాపై సినీ ప్రియులు చూపిస్తోన్న ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు చెప్పింది. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన వ్యక్తికి.. వీధుల్లో జీవించే ఓ అతి పేదవాడికి మధ్య జరిగే సంఘర్షణే ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన చిత్రం 'కుబేర'. రష్మిక కథానాయిక. దేవా పాత్రలో ధనుష్, దీపక్‌గా నాగార్జున నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా బిచ్చగాడి పాత్రలో ధనుష్ నటనకు అంతటా ప్రశంసలు దక్కాయి.

సుమారు మూడు గంటలకు పైగా రన్‌టైమ్ ఉండటంతో దీనిపై పలువురు విమర్శలు చేశారు. దానిని ఉద్దేశించి శేఖర్ కమ్ముల శనివారం జరిగిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ''నిడివి విషయంలో కొంతమంది కామెంట్స్ చేస్తున్నారు. అవసరమైనప్పుడు సినిమాకు కత్తెర వేయాలనేది దర్శకుడు లేదా టీమ్‌కు తెలియని విషయం కాదు. కానీ, ఆయా సన్నివేశాలు ఉండాలి. చెప్పాలనుకున్నప్పుడు దానిని ఆవిధంగా రూపొందించడమే ధర్మం. ఈ సినిమాకు ఇంత నిడివి అవసరం'' అని బదులిచ్చారు.

## కుబేరతో ధనుష్‌కు మరో జాతీయ అవార్డు

'కుబేర' చిత్రంలో ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రధారులు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్ రావు నిర్మించారు. విజయవంతంగా ప్రదర్శించబడుతున్న సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన 'కుబేర' విజయోత్సవ సభ ఏర్పాటు చేశారు. ఈ సినిమా సక్సెస్‌మీట్‌కు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిరంజీవి మాట్లాడుతూ.. ''థియేటర్లకు ప్రేక్షకులను రప్పించడం కష్టమైన ఈ రోజుల్లో 'కుబేర' లాంటి కథా బలం గల ఎమోషనల్ సినిమాతో శేఖర్ కమ్ముల సినీ పరిశ్రమకు ధైర్యం, భరోసా ఇచ్చారు. ఈ చిత్రంలో దేవా పాత్ర నా మనసును తాకింది. భారతీయ చిత్రసీమలో స్టార్ ఇమేజ్ ఉన్నా, ఇలా భిన్నంగా నటించగల నటుడు ధనుష్ మాత్రమే. ఇలాంటి పాత్రను ఆయన కాక మరెవ్వరూ ఈ స్థాయిలో చేయలేరు. ఈ సినిమాతో ఆయనకు మరో జాతీయ అవార్డు ఖాయమని నమ్ముతున్నా'' అన్నారు. ''శేఖర్ ఈ 25 ఏళ్ల సినీ ప్రయాణంలో చాలా కొద్దిపాటి చిత్రాలే చేసినా.. ప్రతీదీ ఆణిముత్యంలా మిగిలిపోయింది. ఈ సినిమాతో నాగార్జునకు కొత్త దారి తెరుచుకుంది. రష్మిక నేషనల్ క్రష్ నుంచి ఇంటర్నేషనల్ క్రష్ అయిపోయింది. త్వరలోనే నేను కూడా ఏషియన్ సినిమాస్ బ్యానర్లో ఓ సినిమా చేస్తా'' అని తెలిపారు. నటుడు ధనుష్ మాట్లాడుతూ.. ''ఈ సినిమా నాకు మహాదేవుడు ఇచ్చిన వరం. యాక్షన్ సినిమాలు తప్ప ప్రేక్షకులు థియేటర్లకు రావట్లేదన్న అపోహను శేఖర్ ఈ చిత్రంతో తొలగించారు'' అన్నారు. దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ.. ''ఈ చిత్రానికి ప్రేక్షకులు ఎంతో ఆదరణ చూపించారు. ఇలాంటి చిత్రాలు మరిన్ని తీయడానికి నాలో ధైర్యం కలిగించారు'' అన్నారు. నాగార్జున మాట్లాడుతూ.. ''ఈ సినిమా పూర్తిగా శేఖర్ సినిమా. అందరం కేవలం పాత్రలమే'' అన్నారు. ఈ కార్యక్రమంలో రష్మిక, సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్ రావు, జాన్వి నారంగ్, దేవిశ్రీ ప్రసాద్, తోట తరణి, నికేత్ బొమ్మి, చైతన్య పింగళి, భాస్కర భట్ల, నంద కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



### హాయ్ నాన్న దర్శకుడితో నాని మరోసారి

కథానాయకుడు నాని ప్రస్తుతం 'ది ప్యారడైజ్' సినిమాతో సెట్స్‌పై బిజీగా గడుపుతున్నారు. దీని తర్వాత సుజీత్ దర్శకత్వంలో ఓ సినిమా చేయాల్సి ఉంది. అయితే ఇప్పుడీ రెండూ ఇంకా పూర్తి కాకుండానే ఆయన మరో చిత్రానికి పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. 'హాయ్ నాన్న'తో తొలి అడుగులోనే ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు శౌర్యువ్‌తో నాని మరో సారి చేతులు కలపనున్నారని సమాచారం. వీళ్లిద్దరి కాంబోలో రూపొందనున్న ఈ కొత్త సినిమా పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో బలమైన భావోద్వేగాలు నిండిన యాక్షన్ కథతో రూపొందనున్నట్లు తెలిసింది. సుజీత్ సినిమా పూర్తికాగానే ఈ ప్రాజెక్ట్ కార్యరూపం లోకి రానున్నట్లు తెలుస్తోంది. నిర్మాణ సంస్థతో పాటు ఇతర అంశాలపై త్వరలో స్పష్టత రానుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY V. SAMPATH PRINTED AT SHARADHA PRINTERS, SHASTRI ROAD, KARIMNAGAR- 505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,Cell:9391343644
PUBLISHED AT H.NO.2-10-2126, MANKAMMATHOTA, BHAGYANANAR, KKARIMNAGAR, -505002, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE. EDITOR : V SAMPATH. TELTEL/2023/89146, EMAIL :shenarthimedia@gmail.com